

వెటర్నరీ కాలనీలో కాలువలు కనిపించకుండా ఇళ్ల ముందు వేసిన కాంక్రీట్ శ్లాబ్



వెటర్నరీ కాలనీలో కాలువ నిండా పిచ్చి మొక్కలు



కో ఆపరేటివ్ బ్యాంక్ రోడ్డులోని కాలువలో మురుగు



వెటర్నరీ కాలనీలో మట్టి, పిచ్చి మొక్కలతో నిండిన కాలువ

కాలువలు అస్తవ్యస్తం

- 9వ వార్డులో పూడుకుపోయిన డ్రెయిన్లు
- మట్టి, మురుగు, పిచ్చి మొక్కలతో మూతపడిన వైనం
- దోమల బెడదతో రోగాల బారిన స్థానికులు



రెవెన్యూ కాలనీలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్త

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డులో **కాలువలు అస్తవ్యస్తంగా** మారాయి. కాలువల్లో మట్టి, మురుగు పేరుకుపోవడం, పిచ్చి మొక్కలతో నిండిపోవడం, రోడ్లపై చెత్త ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో వార్డులో ఎక్కడ చూసినా పారిశుధ్య నిర్వహణ లోపమే కనిపిస్తోంది. దీంతో స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారు.

కాలనీల్లో ఇదీ పరిస్థితి..

వార్డులోని జోడుగుళ్లపాలెం నుంచి విశాలాక్షినగర్, వెటర్నరీ కాలనీ, కొండవాలు ప్రాంతాలైన హనుమంతవాక, సింహగిరి కాలనీ వరకు అధ్వాన పారిశుధ్యంతో ఇదే పరిస్థితి నెలకొంది.

➡ జోడుగుళ్లపాలెంలో అన్నీ చిన్న కాలువలతోపాటు ఇరుకు రోడ్డే. అక్కడ కొన్ని వీధుల్లోకి జీవీఎంసీ పారిశుధ్య వాహనాలు వెళ్లలేవనే నెపంతో రెండు, మూడు రోజులకు ఓ సారి ఇంటింటి చెత్త సేకరణకు కార్మికులు వెళ్తున్నారు. కాలువలో పేరుకుపోయిన పూడికను కూడా తరచూ తొలగించకపోవడంతో మురుగు వాసనతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

➡ రెవెన్యూ కాలనీలోని వీధుల్లో చెత్త తరచూ తొలగించకపోవడంతో రోడ్లపై పేరుకుపోయి అధ్వానంగా మారుతున్నాయి.

➡ కో ఆపరేటివ్ బ్యాంక్ కాలనీ ప్రధాన రహదారి పక్కన కాలువలు మట్టితో మూతపడ్డాయి. కాలువల నుంచి పూడికను తొలగించకపోవడంతో స్థానికులు వాడుక నీరు ఒక్కోసారి రోడ్డుమీదే ప్రవహిస్తోంది. వర్షం పడినప్పుడు ఇక్కడ రోడ్లు జలమయమవుతున్నాయి.

➡ వెటర్నరీ కాలనీలో కాలువలది మరో పరిస్థితి. ఇక్కడ ప్రధాన రహదారి పక్కన కాలువలపై నివాసులు కాంక్రీట్‌తో శ్లాబ్‌లు వేసేశారు. దీంతో కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడానికి పారిశుధ్య కార్మికులకు వీలుపడటం లేదు. మరోపక్క ఈ కాలనీలో మట్టితోపాటు పిచ్చి మొక్కలతో కాలువలు నిండిపోయాయి. కాలువల్లో పేరుకుపోయిన పూడికను శానిటరీ సిబ్బంది తొలగించకపోవడంతో ఆ మట్టిలో పిచ్చి మొక్కలు మొలిశాయి. దీంతో వాడుక నీరు కిందకి వెళ్లే మార్గాలు మూసుకుపోయి ఎక్కడ మురుగు అక్కడే నిల్వ ఉండిపోతోంది.

పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి

ఇటువంటి సమస్యల కారణంగా వార్డులో దోమల విజృంభణతోపాటు అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి వార్డులో కాలువలు శుభ్రం చేయించి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని స్థానికులు కోరుతున్నారు.

కంపుకొడుతున్న చెత్త కుప్పలు



పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డులో కుప్పలుగా పోసిన చెత్త, అధ్వానంగా పరిసరాలు

మద్దిలపాలెం: దసరా పండగ నెపంతో మూడు రోజులుగా జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణ పనులను పక్కనపెట్టారు. దీంతో వీధుల్లో చెత్త విపరీతంగా పేరుకుపోయి భరించలేని కంపు కొడుతున్నాయి. వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో స్థానికులు సతమతమవుతున్నారు. చెత్త కుప్పలపై కుక్కలు చేరి చెల్లాచెదురు చేస్తున్నాయి. డంపర్ బిన్లు నిండిపోవడంతో చెత్త రోడ్డుపై పడి చిందరవందరగా తయారైంది. ఒక వైపు వీధికుక్కల భయం.. మరో వైపు దుర్గంధభరితం కావడంతో కాలనీల వాసులు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు.

పిఠాపురం కాలనీలో అధ్వానం

పిఠాపురం కాలనీ సర్వీస్ రోడ్డులో మైరా కన్వెన్షన్ హాల్ ఎదురుగా ఏర్పాటు చేసిన డంపర్ బిన్లు చెత్తతో నిండిపోయాయి. వ్యర్థాలు కిందపడి కుప్పలుగా తయారయ్యాయి. వీటిపై కుక్కలు చేరడంతో పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. దీనికి ఆనుకుని ఉన్న గ్రీన్‌బెల్ట్ పార్కుకు, ఆ రోడ్డు మీదుగా పాదచారులు ముక్కు మూసుకుని నడవాల్సి వస్తోంది.

కళాభారతి పార్కు వెనుక..

కళాభారతి పార్కు వెనుక ఇండియన్ గ్యాస్ కార్యాలయం ఎదురుగా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. మూడు రోజులుగా దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఈ కారణంగా పార్కుకు సాయంత్రం వేళ సందర్శకులు రావడం లేదు. గత మూడు రోజులుగా చెత్త తొలగించకపోడంపై వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై జీవీఎంసీ జోన్–3 కమిషనర్‌కు కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. ఇదే కాలనీలో రెండు చోట్ల ఇదే పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. పారిశుధ్య అధికారులు స్పందించి తక్షణమే చెత్త కుప్పలు తీయాలని కోరుతున్నారు.



కళాభారతి పార్కు వెనుక పేరుకుపోయిన చెత్త కుప్పలు

క్లుప్తంగా

క్రమశిక్షణతో చదవాలి



సంతపాలెం ఎంపీపీ స్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు సంతపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం డీఈవో ఎల్.చంద్రకళ సందర్శించారు. తరగతి గదులను పరిశీలించారు. దసరా సెలవుల అనంతరం మొదటి రోజు పాఠశాలలు తెరవడంతో విద్యార్థులు హాజరు శాతం తగ్గింది. దీన్ని గమనించిన డీఈవో తల్లిదండ్రులను సంప్రదించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులంతా ప్రతి రోజూ పాఠశాలకు హాజరయ్యేటట్లు చర్యలు చేపట్టాలని హెచ్‌ఎం సిరికి శ్రీనివాసరావుకు సూచించారు. విద్యార్థులతో డీఈవో మాట్లాడుతూ ప్రతి రోజు పాఠశాలకు హాజరై క్రమశిక్షణతో చదువుకోవాలని చెప్పారు.

వెయ్యి జమ్మి మొక్కల పంపిణీ

ఎంవీపీకాలనీ: గ్రీన్ క్లైమేట్ సంస్థ ఆధ్వర్యంలో వెయ్యి జమ్మి మొక్కలను పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజయదశమి సందర్భంగా గత 10 రోజులుగా జమ్మి చెట్టు నాటి, పెంచడం, పూజించడంపై సంస్థ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. విజయదశమిని పురస్కరించుకొని ఏటా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జమ్మిచెట్టుతోపాటు వేప, మోదుగ, రావి, వంటి ఆయుర్వేద గుణాల మొక్కల విశిష్టత, ఔషధ గుణాలపై పెద్ద ఎత్తున సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

20న 'గద్దర్ అన్న యాదిలో..'



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా, మజ్జి దేవిశ్రీ తదితరులు

ఎంవీపీకాలనీ: ప్రజా యుద్ధనౌక గద్దర్ అన్న యాదిలో.. పోస్టర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ ఆవిష్కరించారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–4 లోని గంటా ఇంటి వద్ద సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గద్దర్ తన సాహిత్యం ద్వారా సమాజ చైతన్యానికి బాటలు వేశారన్నారు. మజ్జి దేవిశ్రీ మాట్లాడుతూ ఈ నెల 20న గద్దర్ పాటలు, పోరాటాలను తెలియజేస్తూ విశాఖ పౌర గ్రంథాలయంలో గద్దర్ అన్న యాదిలో.. కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. గద్దర్ సాహిత్యం ఈ సమాజంలో ఉన్నంతకాలం ఆయన పాటలు, రచనలు సజీవంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్, కొయ్య రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్‌లో 'లిటరరీ ఫెస్ట్'

బీచ్‌రోడ్: లాంటర్న్ కల్చర్ అండ్ లిటరరీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నవంబర్ 23, 24 తేదీల్లో బీచ్ రోడ్డులోని హవా మహల్‌లో 5వ వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ డైరెక్టర్ సంధ్యా ప్రియ ఉప్పలపాటి, సానాల్ సరా తెలిపారు. సిరిపురంలోని ఓ హోటల్‌లో సోమవారం వైజాగ్ జూనియర్ లిటరరీ ఫెస్ట్ పోస్టర్‌ను అతిథులు పైడా కృష్ణప్రసాద్, కంకటాల మల్లిక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. నిర్వాహకులు సంధ్యా ప్రియా, సానాల్ మాట్లాడుతూ రెండు రోజుల పాటు 60 సెషన్లలో పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 4 నుంచి 16 ఏళ్ల వయసులోపు విద్యార్థులు ఈ ఫెస్ట్‌లో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఈ నెల 19 నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొదలు కానుందని చెప్పారు. వీఐపీ రోడ్డులోని తనిష్క్ షోరూం, పాత జైల్‌రోడ్డులోని పేజెస్ బుక్ స్టోర్, లాసన్స్ బే కాలనీలోని బుక్ మ్యాజిక్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన రిజిస్ట్రేషన్ కేంద్రాల్లో ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రజా రవాణాతో కాలుష్య నియంత్రణ



ఆర్టీసీ బస్సులో జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్న మేయర్ హరివెంకటకుమారి

డాబాగార్డెన్స్: వారంలో ఒకరోజు ప్రజా రవాణా వినియోగించడం ద్వారా నగర కాలుష్యాన్ని అరికట్టవచ్చని మేయర్ గొలగాని హరివెంకటకుమారి అన్నారు. ఆమె తన క్యాంప్ కార్యాలయం నుంచి సోమవారం జీవీఎంసీ కార్యాలయానికి ఆర్టీసీ బస్సులో చేరుకున్నారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ వై.శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలుష్యం విపరీతంగా పెరిగిపోతున్న దృష్ట్యా వారంలో ఒక రోజు జీవీఎంసీ ఉద్యోగులతోపాటు అందరం ప్రజా రవాణాను వినియోగిస్తున్నామన్నారు. నగరంలో పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు జీవీఎంసీ అనేక అవగాహన పర చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, కళాశాలలు, పరిశ్రమల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థలు, నగర ప్రజలు వారంలో ఒకరోజు ప్రజా రవాణా వ్యవస్థ వినియోగించడం వల్ల విశాఖలో కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

రైతుబజార్లలో వంట నూనెల విక్రయాలు

సీతమ్మధార : రైతుబజార్లలో వంటనూనెల విక్రయాలు కొనసాగుతున్నాయి. వంటనూనెల ధరలు తగ్గాయని మార్కెటింగ్ శాఖ అధికారులు సోమవారం తెలిపారు. ఈ నెల 10న సీతమ్మధార రైతుబజారులో వంటనూనెల విక్రయాల కౌంటర్‌ను జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ ప్రారంభించిన విషయం తెలిసిందే. విశాఖపట్నంలోని 13 రైతుబజార్ల ద్వారా సన్‌ఫ్లవర్ ఆయిల్ 'గోల్డ్ డ్రాప్' లీటర్ రూ.128, క్రిస్టల్ రూ.130, ఫ్రీడమ్ రూ.132కు విక్రయిస్తున్నారు. అలాగే పామాయిల్ లీటర్ రూ.120 వంతున విక్రయించారు. తాజాగా సన్‌ఫ్లవర్ ఆయిల్ ధర రూ.124కి తగ్గింది. అలాగే పామాయిల్ వంట నూనె ధర రూ.110కి తగ్గింది. బహిరంగ మార్కెట్‌లో పామాయిల్ ధర రూ.125, సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.138గా వుంది. రైతుబజార్‌లో ఆయిల్ విక్రయాల కౌంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు కోరుతున్నారు.

బ్రహ్మకుమారీస్ సంస్థ సేవలు అమోఘం



మాట్లాడుతున్న విశాఖ ఎంపీ శ్రీభరత్. చిత్రంలో సీపీ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: బ్రహ్మకుమారీస్ సంస్థ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు అమోఘమని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్ క్లబ్‌లో బ్రహ్మకుమారీస్ విశాఖపట్నం మీడియా వింగ్ సర్వీస్ ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. బ్రహ్మకుమారీస్ సంస్థ పలు అంశాలపై మౌంట్ అబులో చేపట్టిన విశ్లేషణలు మీడియా మిత్రులకు ఉపయోగపడతాయన్నారు. మీడియా బాధ్యతాయుత వార్తలు రాయాలని సూచించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ మీడియా సదస్సు విజయవంతంగా పూర్తి చేసిన పాత్రికేయులను అభినందించారు. ఇన్వెస్టిగేటివ్ జర్నలిజం మంచిదేనని, నిజాన్ని నిర్భయంగా, స్వేచ్ఛగా రాయాలని సూచించారు. పోలీస్, మీడియా పరస్పర సహకారంతో ముందుకు సాగుదామన్నారు. విశాఖను మరింత సురక్షిత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సీపీ తెలిపారు. సదస్సులో పాల్గొన్న మీడియా ప్రతినిధులకు ఎంపీ, సీపీలు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ సభ్యులు మధు, మురళీకృష్ణ, సునీత, నారాయణ, వంశీ, జయలక్ష్మి, భవాని తదతరులు పాల్గొన్నారు.

కేజీహెచ్ సెక్యూరిటీ గార్డుల ఆందోళన



కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సెక్యూరిటీ గార్డులు

మహారాణిపేట: బకాయి జీతాలు ఇవ్వాలని కోరుతూ కేజీహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు సోమవారం ఆందోళనకు దిగారు. 3 నెలలుగా జీతాలు ఇవ్వలేదని, దసరా సందర్భంగా ఇస్తారని భావించినా చెల్లించకపోవడంతో వీరంతా ప్రదర్శన నిర్వహించారు. కేజీహెచ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన సాగింది. కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టి, జీతాలు ఇవ్వాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం కేజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. సీఐటీయూ జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, సీఐటీయూ నాయకుడు కె.చంద్రశేఖర్ కేజీహెచ్‌లో పనిచేస్తున్న సాయి సెక్యూరిటీ గార్డులు సుమారు 30 మందితో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శన అనంతరం విధులకు హాజరయ్యారు. న్యాయపరమైన డిమాండ్లను తక్షణం ఆమోదించాలని, బకాయి జీతాలు ఇవ్వాలని కార్మికులు నినాదాలు చేశారు. తమకు న్యాయభద్రమైన జీతం రూ.11,257 ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఏఎంసీలో స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం



ప్రసంగిస్తున్న ఏఎంసీ వైస్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, చిత్రంలో ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఇతర వైద్యులు



కార్యక్రమానికి హాజరైన 2024 బ్యాచ్ ఎంబీబీఎస్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఎంబీబీఎస్ నూతన విద్యార్థులకు అవగాహన

మహారాణిపేట: ఆల్ ఇండియా కోటా, స్టేట్ కోటాలో మొదటి రెండు రౌండ్ల కౌన్సెలింగ్‌లో చేరిన 2024 బ్యాచ్‌కు చెందిన ఎంబీబీఎస్ విద్యార్థుల కోసం ఆంధ్రా మెడికల్ కాలేజీ సోమవారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించింది. పాఠ్యాంశాలు, ర్యాగింగ్ నిరోధక చర్యలు, హాస్టల్ సౌకర్యాలు మొదలైన వాటిపై కొత్తగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఏఎంసీలో అవగాహన కార్యక్రమాన్ని ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రాజేంద్ర ప్రసాద్ నిర్వహించారు. వైద్య విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. తరగతుల నిర్వహణ, పాఠ్యాంశాలు బోధించడం, ఇతర అంశాలపై విద్యార్థులకు కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ ఎ.కృష్ణవేణి అవగాహన కల్పించారు. అనాటమీ విభాగాధిపతి, బాలుర హాస్టల్ వార్డెన్ డాక్టర్ రవీంద్రకిషోర్, హెచ్‌వోడీ బయోకెమిస్ట్రీ–గర్ల్స్ హాస్టల్ వార్డెన్ డాక్టర్ భవాని, డాక్టర్ పద్మ గీతాంజలి, డాక్టర్ లక్ష్మణ్, అనాటమీ ప్రొఫెసర్, డిప్యూటీ వార్డెన్ డాక్టర్ అశోక్ తదితరులు ప్రసంగించారు. కొత్తగా చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ముందుగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి సుమారు 220 మంది విద్యార్థులు హాజరయ్యారు.

పైడితల్లి ఉత్సవాల్లో పాత కరెన్సీ ప్రదర్శన



పాత నాణేల గురించి వివరిస్తున్న నిర్వాహకుడు శివప్రకాశ్

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు జేఆర్ నగర్‌లో నివసిస్తున్న జి.ఎస్.శివప్రకాష్ అనే రిటైర్డ్ ఉద్యోగి తాను సేకరించిన పురాతన వస్తువులు, నాణేలు, కరెన్సీ నోట్లు, తపాలబిళ్లల ప్రదర్శన సోమవారం విజయనగరం పైడతల్లి అమ్మవారి ఉత్సవాల్లో ఏర్పాటు చేశారు. విజయనగరం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకుడు శివప్రకాశ్ తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజలు, భక్తులు తరలివచ్చి వీటిని తిలకించారన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవస్థానంలో అమ్మవారికి మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

పోర్టు హాస్పిటల్ పీపీపీ బిడ్స్ రద్దుకు డిమాండ్



పోర్టు హాస్పిటల్ వద్ద రిలే నిరాహార దీక్షలో అఖిల పక్ష కార్మిక సంఘాల నాయకులు

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్‌ను పీపీపీకి ఇచ్చేందుకు ప్రతిపాదించిన బిడ్స్ ప్రక్రియను వెంటనే రద్దు చేయాలని, ఆస్పత్రిని పోర్టు అథారిటీయే సొంతంగా నిర్వహించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పోర్టు ఆస్పత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 14వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకుడు మసేన్, హెచ్‌ఎంఎస్ నాయకుడు మంగనాయుడు, సీఐటీయూ నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, బి.జగన్, ఐఎన్‌టీయూసీ నాయకుడు గొర్లె చందు, సీఎఫ్‌టీయూ నాయకుడు మూర్తి, బీఎంఎస్ నాయకుడు రవిశంకర్ మాట్లాడారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని, ఏటా కోట్ల రూపాయల లాభాలు ఆర్జిస్తున్న పోర్టు యాజమాన్యమే సొంత నిధులతో ఆస్పత్రిని నిర్వహించాలని కోరారు. కార్మికుల కష్టాలతోనే వేల కోట్లు సంపాదించి ప్రస్తుతం వారి ఆరోగ్యాన్ని గాలికొదిలేయాలనుకోవడం సరికాదన్నారు. మరో 100 సంవత్సరాలకు సరిపోయే రిజర్వు ఫండ్స్ పోర్టు వద్ద ఉన్నాయని, అయినా ఆస్పత్రిని ప్రైవేటు, కార్పొరేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని బీజేపీ ప్రభుత్వం ఆలోచించడం దుర్మార్గమని ఆరోపించారు. రామలింగేశ్వరావు, శంకర్రావు, నాయుడు, రాఘవులు, రమణ, పోతన్న, ఆంజనేయులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా తిరువీధి



తిరువీధిలో అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం తిరువీధి ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను పల్లకిలో అధిష్టింపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధి నిర్వహించారు. విశేషంగా హారతి అందించారు. భక్తులు తిరువీధిలో స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆదాయ పన్నుపై అవగాహన



మాట్లాడుతున్న ఇన్‌కంట్యాక్స్ జాయింట్ కమిషనర్ ప్రసాద్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఇన్‌కమ్‌టాక్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆదాయపు పన్ను చెల్లింపుల్లో వచ్చిన మార్పులు, ఇటీవల పరిణామాలను టీడీఎస్ సర్కిల్ జాయింట్ కమిషనర్ కె.ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ ఐ. మధుసూదనరావు వివరించారు. ఆర్థిక సమాచారం, వార్షిక సమాచార వ్యవస్థ ద్వారా డేటా సేకరణ, అప్పీళ్ల గురించి తెలియజేశారు. ఐటీ మినహాయింపులు, నిజమైన క్లెయిమ్‌లు, పన్ను చెల్లింపుదారుల సేవలపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు లేవనెత్తిన సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఆదాయపు పన్ను శాఖ, స్టీల్‌ప్లాంట్ అధికారులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల ధరలు నియంత్రించాలి

సీతంపేట: రాష్ట్రంలో భారీగా పెరిగిన వంట నూనె, నిత్యావసర సరకుల ధరలు వెంటనే తగ్గించాలని సీపీఐ నాయకులు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. నరసింహనగర్ రైతుబజార్ వద్ద సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన ధర్నాను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర వస్తువుల ధరలు, కాయకూరల ధరలు భారీగా పెంచి ఆహార భద్రత లేకుండా చేశాయని మండిపడ్డారు. ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, లేదంటే ప్రజాగ్రహాన్ని చవిచూడక తప్పదన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు రావి కృష్ణ, చిల్లర సంఘం నాయకులు జి.శ్రీనివాసరావు, పి.సాయికుమార్, వెంకటరాయుడు, ఎం.రాము పాల్గొన్నారు.